సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



పనితీరు బాగా లేని..

పనితీరు బాగాలేని సొసైటీ పాలకవర్గాలకు పొడిగింపు ఇవ్వకుండా ప్రభుత్వం అధికారులకు నిర్ణయాధికారాన్ని ఇచ్చింది.

- 8లో ▸



కేరళ సంస్కృతికి ప్రతీక..

కేరళ సంస్కృతికి ఓనం ప్రతీక అని ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. తిరుమల నర్సింగ్ కళాశాలలో 'ఓనం' ఘనంగా నిర్వహించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.8 /21.7

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. కొన్నిచోట్ల జల్లులు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

మార్కెట్‌యార్డుకు వరుస సెలవులు

సుభాష్‌నగర్: జిల్లా కేంద్రంలోని శ్రద్ధానంద్ గంజ్ మార్కెట్‌యార్డుకు ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు వరుస సెలవులు ప్రకటించినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ అపర్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 5న మిలాద్ – ఉన్ – నబీ, 6న శనివారం అనంత చతుర్థి (వినాయక నిమజ్జనం), 7న ఆదివారం, 8న గ్రహణకరి కావడంతో ఎలాంటి వ్యాపార లావాదేవీలు జరపబోమని పేర్కొన్నారు. రైతులు తాము పండించిన వ్యవసాయ ఉత్పత్తులను యార్డుకు తీసుకురావొద్దని సూచించారు. 9వ తేదీ నుంచి మార్కెట్‌లో వ్యాపార లావాదేవీలు యథావిధిగా కొనసాగుతాయని, రైతులు సహకరించాలని సెక్రెటరీ కోరారు.

ఎస్సారెస్పీ నుంచి తగ్గిన నీటి విడుదల

- లక్ష క్యూసెక్కుల ఇన్ ఫ్లో



బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్ ఫ్లో తగ్గుముఖం పట్టడంతో గోదావరిలోకి నీటి విడుదలను అధికారులు గురువారం మరింత తగ్గించారు. లక్ష క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, 23 వరద గేట్ల ద్వారా 74 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వరద కాలువ ద్వారా 18వేల క్యూసెక్కులు, కాకతీయకాలువ ద్వారా 4,500, ఎస్కేప్ గేట్ల ద్వారా 3,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ఆవిరి రూపంలో 666 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091 (80.5 టీఎంసీలు) అడుగులు కాగా 1089.8 (76.10 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

పటిష్ట నిఘా.. పర్యవేక్షణ

- గణేశ్ శోభాయాత్రకు 1300 మంది సిబ్బంది
- డ్రోన్, సీసీ కెమెరాల ఏర్పాటు



ఖలీల్‌వాడి: గణేశ్ నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని సీపీ పోతరాజు సాయిచైతన్య తెలిపారు. శోభాయాత్ర ప్రశాంత వాతావరణంలో కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నామనినారు. సుమారు 1300 మందికి పైగా సిబ్బందిని నియమించామని, సీసీ కెమెరాలు, నిఘా డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నామన్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీస్ సిబ్బందితోపాటు ఎక్సైజ్, ఫారెస్ట్, ఎన్‌సీసీ, ఎస్ఎస్ఎస్‌తో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. శోభాయాత్రలో ఎక్కడైనా అనుమానాస్పద రీతిలో వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని, ఆడియో సిస్టమ్స్‌ను నిర్ణీత స్థాయిలో ఉపయోగించాలన్నారు. డీజేలు పూర్తిగా నిషేధమని, పుకార్లను నమ్మొద్దని సూచించారు. అత్యవసర సమయంలో డయల్ 100, పోలీస్ కంట్రోల్ రూమ్ 87126 59700, సంబంధిత పోలీస్ స్టేషన్‌లలో సంప్రదించాలని అన్నారు.



సమీక్షలో పాల్గొన్న సీఎం రేవంత్, మంత్రులు సీతక్క, పొంగులేటి, పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్, పోచారం, ఎంపీ షెట్కార్, ఎమ్మెల్యేలు

అండగా ఉంటా

"ఎన్నడూ లేనంత వరదలతో వాటిల్లిన ఇబ్బందులను చూసి ఆదుకోవాలన్న ఉద్దేశంతోనే ఇక్కడిదాకా వచ్చా. మీకు జరిగిన నష్టాన్ని చూశా. మళ్లీ ఇలాంటి సమస్య ఎదురు కావొద్దు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. అందుకోసం అవసరమైన నిధులు ఇస్తా. అధైర్యపడకండి అండగా ఉంటా'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాల్లో పర్యటించిన సీఎం.. వరదలతో దెబ్బతిన్న పంటలు, వంతెనలు, ఇళ్లను పరిశీలించారు. బాధితులను కలిసి వారి గోడును విన్నారు. "మీ కష్టాలు తీర్చడానికే వచ్చా''నంటూ వారికి భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి/కామారెడ్డి టౌన్/ లింగంపేట



- జీఆర్ కాలనీ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం
- నష్టపోయిన రైతులను ఆదుకుంటాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- లింగంపల్లి కుర్దు, బూరుగిద్ద, కామారెడ్డిలలో పర్యటన
- వరదలతో దెబ్బతిన్న పంటలు, వంతెన, రోడ్ల పరిశీలన
- బాధితులకు భరోసా కల్పించిన సీఎం



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



జీఆర్ కాలనీలో వరద బాధితులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్

జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలు, వచ్చిన వరదలతో జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌నుంచి హెలీకాప్టర్ ద్వారా జిల్లాకు చేరుకున్నారు. లింగంపేట మండలంతో పాటు కామారెడ్డి పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అధికారులందరూ సమన్వయంతో ముందుకువెళ్లడంతో ప్రాణనష్టం జరగలేదన్నారు. వరదలు వచ్చిన రోజునే మంత్రి సీతక్క, ఎంపీ షెట్కార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీలకు ఫోన్ చేసి బాధితులకు అండగా ఉండాలని సూచించానన్నారు. వరద సహాయక చర్యల్లో కామారెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యేలు కృషి చేశారన్నారు. వరదల్లో పిల్లల పుస్తకాలు తడిచిపోయాయని చెప్పారని, కాంటింజెన్సీ ఫండ్ నుంచి విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అలాగే ఫార్మా కంపెనీలు, బీడీ పరిశ్రమలతో మాట్లాడి వారి సహకారంతో కాలనీ వాసులను ఆదుకోవాలని కలెక్టర్, ఎస్పీలకు సూచించారు. "కంపెనీలు ఇచ్చే సాయం తీసుకోండి, ఇంకా ఏది కావాలన్నా నేను ఇస్తా'' అని అన్నారు.

వందేళ్ల కింద కట్టినా..

పోచారం ప్రాజెక్టును 103 ఏళ్ల కిందట రూ. 26 లక్షలతో నిర్మించినా అది ఇంతటి వరదలను తట్టుకుని నిలబడడం మజ్‌బూత్‌గా ఉందన్నారు. జిల్లాలో వరదలతో దెబ్బతిన్న చెరువులు, కుంటలు, రోడ్లకు అన్ని మరమ్మతులు చేయిస్తానన్నారు. వరద బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని పేర్కొన్నారు. "మంచిగా ఉన్నపుడు కాదు, కష్టం వచ్చినపుడు వెన్నంటి నిలబడేవాడే నాయకుడు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి వరదల సమయంలో ప్రజలకు అండగా నిలిచారు'' అంటూ అభినందించారు.

ఒక్కో శాఖపై సుదీర్ఘంగా సమీక్ష

కలెక్టరేట్‌లో అధికారులతో సీఎం దాదాపు గంటన్నర పాటు సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లో మొదట ఫొటో ప్రదర్శనను తిలకించిన అనంతరం భోజనం చేశారు. అనంతరం జరిగిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వరదలతో జరిగిన నష్టం, చేసిన పనిని వివరించారు. ఈ సందర్భంగా సీఎం ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఎన్పీడీసీఎల్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యారోగ్యశాఖ, వ్యవసాయం, నీటి పారుదల శాఖలపై సుదీర్ఘంగా సమీక్షించారు.

మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ఎంపీ సురేశ్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు వెంకటరమణారెడ్డి, మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతారావు, సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు, కామారెడ్డి డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావ్, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ లెక్కనే అభివృద్ధి జేస్తా..

"ఎన్నికల సమయంలో చెప్పినట్లే కొడంగల్‌తో సమానంగా కామారెడ్డిని చూస్తా.. అభివృద్ధి చేస్తా. ఏ సమస్య ఉన్నా కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి దృష్టికి తీసుకురండి. ఆయన సహకారంతో కామారెడ్డిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులు ఇస్తా. కామారెడ్డిలో ఏ కష్టమొచ్చినా ఆదుకునే బాధ్యత నాది'' అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

మాది ప్రజా ప్రభుత్వం



మాది ప్రజా ప్రభుత్వం. వరదల రోజున అనివార్య కారణాలతో సీఎం రాలేకపోయినా పట్టు వదలకుండా ప్రజల బాధలు తెలుసుకుని సహాయం చేయడానికి మళ్లీ కామారెడ్డికి వచ్చినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం. వరదల్లో నష్టపోయిన వారిని ఆదుకునేందుకు మేమంతా ముందుంటాం. ఇక్కడి బాధితుల పరిస్థితిని సీఎంకు వివరించాం. – సీతక్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి

ఎవరికి కష్టమొచ్చినా ఆదుకుంటాం



రాష్ట్రంలో ప్రజలకు ఎక్కడ కష్టం వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుంది. వరద ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సీఎంతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక నేతలు ఎక్కడికకడ ప్రభుత్వ ఆదేశాలతో సహాయక చర్యలు చేపట్టారు. ప్రజల బాధలను ప్రత్యక్షంగా చూడాలని సీఎం వచ్చి ఆదుకోవడం మాకు గర్వంగా ఉంది. – మహేశ్‌కుమార్‌గౌడ్, పీసీసీ అధ్యక్షుడు

అవినీతికి కేరాఫ్‌గా బల్దియా

ఒక్కో ఫైల్‌కు ఒక్కో రేటు

- రెవెన్యూ, టీపీవో సిబ్బందిపై తీవ్ర ఆరోపణలు
- పదేళ్లుగా ఒకే విభాగం నుంచి కదలని సిబ్బంది.. భారీగా పెండింగ్ ఫైళ్లు
- ఏకంగా కార్యాలయంలోనే డబ్బులు తీసుకుంటున్న వైనం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నిజామాబాద్ నగర పాలక సంస్థలో రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ సిబ్బంది అక్రమ వసూళ్ల పర్వానికి అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. బల్దియా అంటేనే అవినీతికి కేరాఫ్‌గా మారిపోయింది. స్థానిక ఎమ్మెల్యే ధన్‌పాల్ ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా బహిరంగంగానే పలుమార్లు ఈ విషయం చెప్పడం పరిస్థితికి అద్దం పడుతోంది. ఇటీవల మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్‌ను బదిలీ చేయించేందుకు కొందరు అవినీతిపరులైన ఉద్యోగులు, అధికారులు చేసిన కుట్రలు చూసి అధికార పార్టీ నేతలైన ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డిలు సైతం ఆశ్చర్యపోవడం గమనార్హం. దీన్ని బట్టే చూస్తే బల్దియాలో ఉద్యోగులు చేస్తున్న అవినీతి అక్రమాలు ఎలా ఉన్నాయో తెలుస్తోంది. బల్దియా చరిత్రలో ఇప్పటివరకు పదుల సంఖ్యలో ఏసీబీ దాడులు జరిగాయి. 2024 ఆగస్టు 9న ఆర్‌వో దాసరి నరేందర్ రూ.3 కోట్ల నగదుతో పట్టుబడడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తాజాగా ఆర్ఐ శ్రీనివాసరావు ఆర్మీ జవాన్ నుంచి రూ.7వేలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు.

ఫైలుకో రేటు..

బల్దియాలో పైసలిస్తేనే ఫైళ్లు కదిలే పరిస్థితి. ప్రభుత్వ ఫీజులు చెల్లించినప్పటికీ అనుమతులు ఇవ్వడం లేదు. నెలల తరబడి తిప్పుతున్నారు. బోర్గాం(పి)కు చెందిన ఓ వ్యక్తి తన పాత ఇంటిని తొలగించి కొత్త ఇంటిని కట్టుకోవడానికి అనుమతి కోసం రెండేళ్లుగా తిరుగుతున్నాడు. చివరికి ఫైలు కనిపించడంలేదని తెలిపారు. అయితే ముడుపులు ఇవ్వగానే రెండు రోజుల్లో అనుమతి పత్రం చేతిలో పెట్టారు. నగరంలోని కవిత కాంప్లెక్స్‌లో ఓ దుకాణదారుడు పన్ను చెల్లిస్తానని ముందుకు వచ్చినప్పటికీ ఆయనను ముప్పుతిప్పలు పెట్టడం గమనార్హం. కొలతలు సరిగా లేవని, కొత్త మెజర్‌మెంట్స్ తీసుకోవాలని, సైట్ పనిచేయడం లేదంటూ పలు కారణాలు చెబుతూ ఆరు నెలలు తిప్పారు. చివరకు సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఒకరిని కలిసి ముడుపులు ఇవ్వడంతో రెండు రోజుల్లో పని పూర్తి చేశారు. ఇటీవల వినాయక్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి అసెస్‌మెంట్ కోసం వెళ్తే తిప్పి తిప్పి, చివరకు రూ.30 వేలు తీసుకుని అనుమతి ఇచ్చారు. ఎల్లమ్మగుట్టకు చెందిన ఓ తాజా మాజీ కార్పొరేటర్‌కు సంబంధించిన సొంత పనిని కూడా చేయకుండా నెలల తరబ డి తిప్పుతున్నారు. కార్పొరేటర్లను సైతం ముప్పుతిప్పలు పెట్టిన సందర్భాలు కోకొల్లలు.

చక్రం తిప్పుతున్న వార్డు ఆఫీసర్లు

60 డివిజన్లకుగాను 60 మంది వార్డు ఆఫీసర్లను నియమించి వారికి రెవెన్యూ బాధ్యతలు అప్పగించారు. పన్ను వసూలు చేయడం, ట్రేడ్ లైసెన్సులు లేని వారికి కొత్తగా లైసెన్సులు ఇప్పించడం, పాతవాటిని రెన్యువల్ చేయించడంతో పాటు పలు పనులు అప్పగించారు. అయితే వీరిలో కొందరు లంచగొండులుగా మారారు. ఇందిరమ్మ ఇళ్ల వ్యవహారంలో ఒక్కో లబ్ధిదారు నుంచి రూ.20 వేల నుంచి రూ.30 వేలు వసూలు చేసినట్లు పలు ఫిర్యాదులు అందాయి. ముఖ్యంగా నాగారం, అర్సపల్లి, సారంగాపూర్ వంటి అటవీ భూములున్న చోట, పేదలున్న డివిజన్లలో వార్డు ఆఫీసర్లు డబ్బులు ఇవ్వనిదే పనులు చేయడం లేదు. వార్డు ఆఫీసర్లలో కొందరు బిల్ కలెక్టర్లు కూడా ఉన్నారు.

అవినీతికి పరాకాష్ట.. కీలక అధికారి

రెండేళ్ల క్రితం ఇక్కడే విధులు నిర్వహించి అప్పటి మేయర్ భర్తతో గొడవ పెట్టుకుని వెళ్లిపోయిన ఓ కీలక అధికారి, మళ్లీ ఇక్కడికి వచ్చేందుకు అన్నిరకాలుగా ప్రయత్నించాడు. ఎట్టకేలకు మళ్లీ బదిలీపై వచ్చాడు. తనకు నచ్చిన విభాగానికి వచ్చేందుకు సదరు స్థానంలో ఉన్న మరో అధికారిని బదిలీ చేయించినట్లు బహిరంగంగానే చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఉన్న అధికారి పెండింగ్ ఫైళ్లు తెప్పించుకుని ముడుపులు తీసుకుని క్లియర్ చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. పదిరోజుల్లో వందల సంఖ్యలో ఫైళ్లను క్లియర్ చేయడం గమనార్హం. ప్రస్తుతం ఆర్‌ఐగా ఉన్న శ్రీనివాస్‌రావును తన ఏజెంట్‌గా నియమించుకుని మరీ డబ్బులు వసూలు చేసినట్లు బల్దియా వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఎవరు వచ్చి తనను కలిసినా, ముందుగా ఆర్‌ఐ శ్రీనివాస్‌ను కలిసిన తర్వాతే ఇక్కడికి రావాలనే నిబంధన పెట్టాడు. ఈ వసూళ్ల అధికారిని ఏసీబీకి పట్టించేందుకు పలువురు ప్రయత్నాలు చేశారు. అయితే ఇతని తరుపున లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన శ్రీనివాస్, సదరు అధికారి పేరు చెప్పినప్పటికీ ఏసీబీ అధికారులు చివరి నిమిషంలో సదరు అధికారి పేరు తొలగించడం గమనార్హం.

సస్పెన్షనా.. సరెండరా.. మీరే తేల్చుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దిలీప్‌కుమార్

నిజామాబాద్ సిటీ : అవినీతికి పాల్పడుతూ కొంత మంది మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులు బల్దియా పరువు తీస్తున్నారని, ఇప్పటి వరకు ఉపేక్షించినా ఇకపై ఊరుకునేది లేదని కమిషనర్ దిలీప్‌కుమార్ హెచ్చరించారు. లంచం తీసుకున్నట్లు తెలిస్తే సస్పెన్షన్ చేయమంటారా..? లేదా ప్రభుత్వానికి సరెండర్ చేయమంటారో.. మీరే తేల్చుకోవాలని అన్నారు. బల్దియా కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ రవీంద్రసాగర్, డిప్యూటీ కమిషనర్ రవిబాబుతోపాటు రెవెన్యూ ఉద్యోగులు, బిల్లు కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రెండు గంటలపాటు డివిజన్ల వారీగా రివ్యూ నిర్వహించారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ ఏసీబీకి పట్టుబడిన అంశాన్ని ప్రస్తావిస్తూ.. లంచం కోసం ఆర్మీ జవాన్‌ను సైతం వదిలిపెట్టలేదని, కేవలం వీఎల్‌టీ కోసం లంచం డిమాండ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. కొంతమంది వార్డు ఆఫీసర్లు కూడా లంచగొండులుగా తయారవుతున్నారని, ప్రజలను పీడిస్తున్నట్లు తనకు ఫిర్యాదులు అందాయన్నారు. పద్ధతి మార్చుకోవాలని, లేకుంటే సెలవు పెట్టి వెళ్లిపోవాలని స్పష్టం చేశారు. పనులు చేసేందుకు డబ్బులు డిమాండ్ చేసినా, పనుల్లో నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించబోనని హెచ్చరించారు. సమావేశంలో ఆర్‌వో ఖయ్యూం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు దిలీ ప్, వార్డు ఆఫీసర్లు, బిల్లు కలెక్టర్లు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

- తాత్కాలిక, శాశ్వత ప్రాతిపదికన పనులను విభజించాలి
- వరద నష్టం ప్రభుత్వానికి నివేదిస్తాం
- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

సిరికొండ : వరదల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, వంతెనలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని కొండూర్ వద్ద కప్పలవాగుపై తెగిపోయిన వంతెన, రోడ్డును, పెద్దవాల్గోట్ వద్ద కోతకు గురైన రోడ్డును, ఇసుక మేటలు వేసిన పొలాలను, ధ్వంసమైన విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను ఆయన గురువారం పరిశీలించారు. తక్షణమే చేపట్టాల్సిన పనుల జాబితాలో కొండూర్ రోడ్డును చేర్చి, వెంటనే పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. తాత్కాలిక ప్రాతిపదికన తక్షణమే చేపట్టాల్సిన, శాశ్వత ప్రాతిపదికన చేపట్టాల్సిన పనులను విభజించి ప్రాధాన్యతా క్రమంలో చేపట్టేలా పర్యవేక్షించాలన్నారు. పెద్దవాల్గోట్‌లో కొనసాగుతున్న రోడ్డు పునరుద్ధరణ పనులను పరిశీలించారు. వరద నష్టంపై సమగ్ర వివరాలతో నివేదికను రూపొందించి ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. అనంతరం పెద్దవాల్గోట్‌లో సొసైటీ గోదాముతోపాటు పల్లె దవాఖానను, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట పీఆర్ ఈఈ శంకర్‌నాయక్, డీఈ హైమద్ హుస్సేన్ తదితరులున్నారు.



కొండూరు వంతెనను పరిశీలిస్తున్న కలెక్టర్

అసలు నష్టం ఎంత!

- పంటనష్టంపై తుది నివేదిక రూపొందిస్తున్న వ్యవసాయ శాఖ
- రైతు వారీగా వివరాలు సేకరిస్తున్న క్షేత్రస్థాయి సిబ్బంది
- ప్రాథమిక అంచనా ప్రకారం 48,429 ఎకరాల్లో నష్టం..
- 33 శాతానికి మించి నష్టపోయిన రైతులకే పరిహారం!



ధర్పల్లి మండలం హొన్నాజీపేట్‌లో రైతుల వివరాలు నమోదు చేసుకుంటున్న అధికారులు

డొంకేశ్వర్(ఆర్మూర్) : భారీ వర్షాల కారణంగా జిల్లాలో 48,429 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. వర్షాలు, వరద తగ్గుముఖం పట్టి ముంపునకు గురైన పంటలు బయటకు తేలడంతో తుది నివేదికను వ్యవసాయశాఖ రూపొందిస్తోంది. అసలు నష్టం ఎంత అని తెలుసుకునేందుకు వ్యవసాయ అధికారులు రైతు వారీగా సర్వే చేపట్టి వివరాలు సేకరిస్తున్నారు. 33శాతానికి మించి పంటలు నష్టపోయిన రైతుల నుంచి ఆధార్, పట్టాపాస్ పుస్తకం, బ్యాంకు ఖాతాల జిరాక్స్ కాపీలను తీసుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 33 శాతానికి మించి పంట నష్టం జరిగిన రైతులకే పరిహారం అందే అవకాశాలున్నాయి. రెండు రోజుల్లో సర్వే పూర్తి చేసి తుది జాబితాను కలెక్టర్ అనుమతితో ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ పంపనుంది.

పంటల నష్టం ప్రాథమిక అంచనా (ఎకరాల్లో)

వరి	సోయా	మొక్క జొన్న	పత్తి	పెసర	పసుపు, ఉద్యాన పంటలు	ఇతర పంటలు
30,473	16,157	1,108	171	05	435	80

బాధిత రైతులు 24,778 మంది..

భారీ వర్షాలు పంటలను తీవ్రంగా దెబ్బతీశాయి. చెరువులు, కుంటలు, వాగులు పొంగడంతో పాటు వరద నీరు పోటెత్తి ప్రాజెక్టుల బ్యాక్ వాటర్ ప్రాంతాల్లోని పంటలు పెద్ద ఎత్తున నీట మునిగాయి. బోధన్, నిజామాబాద్ రూరల్, భీమ్‌గల్ నియోజకవర్గాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పంట పొలాల్లో ఇసుక మేటలు వేయడంతోపాటు నీటికి కొట్టుకుపోయి ధ్వంసమయ్యాయి. అత్యధికంగా వరికి నష్టం వాటిల్లగా సోయా, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. ప్రాథమిక అంచనా ప్రకారం జిల్లా వ్యాప్తంగా 23 మండలాల పరిధిలోని 183 గ్రామాల్లో ఈ పంట నష్టం జరుగగా, 24,778మంది రైతులు బాధితులుగా ఉన్నారు.

రెండు రోజుల్లో తుది నివేదిక

33 శాతానికి మించి దెబ్బతిన్న పంటలను గుర్తిస్తున్నాం. పంట, రైతు పే రు, తదితర వివరాలను సేకరించి తుది నివేదికను రెండు రోజుల్లో తయారు చేస్తాం. కలెక్టర్ అనుమతి తో ప్రభుత్వానికి పంపుతాం. – మేకల గోవింద్, జిల్లా వ్యవసాయాధికారి

రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపిక

- ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లా టీచర్లు
- ప్రిన్సిపాల్ కేటగిరిలో బోర్గాం(పీ) జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం శంకర్
- ఉపాధ్యాయుల కేటగిరిలో కంజర్ జెడ్పీహెచ్ఎస్ గణితం టీచర్ గోపాలకృష్ణ



గోపాలకృష్ణ, గణితం టీచర్, కంజర్



సీహెచ్ శంకర్, ప్రిన్సిపాల్, బోర్గాం(పి) జెడ్పీహెచ్ఎస్

మోపాల్(నిజామాబాద్‌రూరల్) : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రతిఏడాది ప్రకటించే రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు జిల్లాకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. మోపాల్ మండలం బోర్గాం(పి) జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సీహెచ్ శంకర్ (ప్రిన్సిపాల్ కేటగిరి), కంజర్ జెడ్పీహెచ్ఎస్ గణితం ఉపాధ్యాయుడు రాఘవపురం గోపాలకృష్ణ (ఉపాధ్యాయుల కేటగిరి)ఎంపికయ్యారు. మొత్తం 9 అంశాల్లో ఉపాధ్యాయుల రెండేళ్ల పనితీరును పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చేతుల మీదుగా వీరు అవార్డులు అందుకోనున్నారు.

బోధనోపకరణాలతో..

బోధన్‌కు చెందిన రాఘవపురం గోపాలకృష్ణ పేద కుటుంబంలో పుట్టాడు. పేపర్ వేస్తూ, పాల ప్యాకెట్లు పంచుతూ, హోటల్‌లో, మేస్త్రీగా పని చేసుకుంటూనే కుటుంబానికి చేదోడువాదోడుగా నిలిచారు. 1998లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించిన ఆయన నిజాంసాగర్ మండలంలోని తుర్కపల్లిలో మొదట పోస్టింగ్‌లో చేరారు. ఆ తర్వాత 2009లో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందాడు. కళా ఆధారిత విద్యను ప్రోత్సహించడం, బోధనోపకరణాలు తయారు చేయడం, పని చేసే పాఠశాలల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయడం ఆయన అంకితభావానికి నిదర్శనం.

నిజాయితీ, నిబద్ధత శంకర్ సొంతం..

ఎక్కడ పని చేసినా నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణకు ఆయన పెట్టింది పేరు శంకర్. పని చేసిన చోట గ్రామస్తులు, ప్రజాప్రతినిధుల సహకారంతో పాఠశాలను అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారు. తోటి ఉపాధ్యాయులతో సమన్వయం, సహకారంతో 1000 మందికిపైగా విద్యార్థులు ఉన్న బోర్గాం(పి) జెడ్పీ ఉన్నత పాఠశాలను విజయవంతంగా నడిపిస్తున్నారు. 1997లో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించారు.

ఉత్తమ అధ్యాపకుడు రాంబాబు



ప్రొఫెసర్ రాంబాబు

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ కామర్స్ విభాగాధిపతి, డీన్ ప్రొఫెసర్ గోపిశెట్టి రాంబాబు రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. ఉత్తమ బోధనతోపాటు అత్యుత్తమ పరిశోధనలకు గాను రాంబాబును రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపిక చేసింది. 28 ఏళ్ల సుదీర్ఘ బోధనానుభవం ఉన్న రాంబాబు ఇప్పటి వరకు నాలుగు జాతీయ అవార్డులు, ఒక అంతర్జాతీయ అవార్డు సాధించారు. రాంబాబును వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు తరలిన క్రీడాకారులు



నిజామాబాద్‌నాగారం: నిర్మల్‌లో ఈ నెల 5 నుంచి 7 వరకు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల యోగాసన పోటీలు జరుగనున్నాయి. ఈనేపథ్యంలో నిజామాబాద్ జిల్లా నుంచి 20 మంది యోగా క్రీడాకారులు గురువారం నిర్మల్ తరలివెళ్లారు. జిల్లా జట్టుకు కోచ్‌గా ఉమారాణి, శివ కుమార్ వ్యవరిస్తున్నారు. వీరితోపాటు టెక్నికల్ అఫీషియల్స్‌గా ఎంపికైన ఏడుగురు జిల్లా నుంచి వెళ్లారు. అంతకుముందు క్రీడాకారులను జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు యోగా రాంచందర్, ప్రతినిధులు ఎక్కొండ ప్రభాకర్, బాల శేఖర్, సంగీత, భూమాగౌడ్, రఘువీర్, గంగాధర్, జ్యోతి, రసజ్ఞ అభినందించారు.

కొనసాగుతున్న పీజీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పీజీ, బీఎడ్, ఎంఎడ్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా కొనసాగినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఇంటిగ్రేటెడ్ పీజీ 8, 10వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 45 మంది విద్యార్థులకు గానూ 44 మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. బీఎడ్, 2, 4వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 46 మంది విద్యార్థులకు గానూ 33 మంది హాజరు కాగా 13 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. అలాగే ఎంఎడ్ 4వ సెమిస్టర్ రెగ్యులర్, 1,2 3, 4వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 33 మంది విద్యార్థులకు గానూ 31 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

పనితీరు బాగా లేని పాలకవర్గాలకు గుడ్‌బై

- సహకార సంఘాల పదవీకాలాన్ని పొడిగిస్తూ ఉత్తర్వులు
- తాజాగా 43 సంఘాల పాలకవర్గాలకు వర్తింపు
- పరిశీలనలో 20 పాలకవర్గాలు
- 26 పాలకవర్గాలకు నో చెప్పిన అధికార యంత్రాంగం



మోర్తాడ్(బాల్కొండ) : సహకార సంఘాల పాలకవర్గాల పాలన తీరు బాగుంటేనే పదవీకాలాన్ని పొడిగించాలనే నిబంధనను విధించడంతో కొన్ని పాలకవర్గాలకు ఉద్వాసన పలుకుతూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. సహకార సంఘాల పదవీ కాలం గత ఫిబ్రవరిలో ముగియగా, సకాలంలో ఎన్నికలను నిర్వహించని కారణంతో పదవీ కాలాన్ని ఆగస్టు 14 వరకూ పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే పొడిగించిన పదవీ కాలం గడువు కూడా ముగియడంతో మరోసారి పొడిగింపు ఉత్తర్వులను ప్రభుత్వం ఆగస్టు 14వ తేదీన జారీ చేసినప్పటికీ గతంలో మాదిరిగా అన్ని సంఘాల పాలకవర్గాలకు పొడిగింపు ఇవ్వకుండా ప్రభుత్వం కొత్త నిబంధన విధించింది. పాలకవర్గాల పాలన తీరు ఎలా ఉంది, సంఘాల ఆర్థిక పరిస్థితి, ఎక్కడైన పాలకవర్గాలు అక్రమాలకు పాల్పడ్డాయా, నిధుల దుర్వినియోగం తదితర అంశాలపై ప్రభుత్వం సహకార శాఖ నివేదికను కోరింది. జిల్లాలో 89 సహకార సంఘాలు ఉండగా అన్ని పాలకవర్గాల పనితీరును సహకార శాఖ విశ్లేషించింది. చివరకు 43 సంఘాల పాలకవర్గాలకు పొడిగింపు ఆదేశాలను గురువారం ఇచ్చింది. మరో 20 సంఘాల పాలకవర్గాల పనితీరును పరిశీలిస్తుండగా, వీటికి రెండు మూడు రోజుల్లో పొడిగింపు ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది. 26 సంఘాల పాలకవర్గాల పనితీరు అసలే బాగోలేదని నిర్ధారణకు వచ్చిన అధికారులు సహకార శాఖ అధికారులకు పర్సన్ ఇన్‌చార్జీ బాధ్యతలను అప్పగించనున్నారు. ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం పాలకవర్గాల పనితీరుపై ఉన్నతాధికారులు తమ ఆడిటర్లు, వివిధ హోదాల్లో ఉన్న ఉద్యోగులతో వివరాలను సేకరించారు. సహకార శాఖ రిజిస్ట్రార్‌కు నివేదికను పంపించడంతో పాలకవర్గాల పొడిగింపునకు వారు నిర్ణయం తీసుకున్నారు. నిధులను సొంతానికి వాడుకోవడం, సకాలంలో ఎరువుల కంపెనీలకు బకాయిలు చెల్లించకపోవడం, రుణాల వసూళ్లలో వెనుకబడి ఉండటం ఇలా పలు కారణాలతో కొన్ని సంఘాల పాలకవర్గాల స్థానంలో అధికారులకు బాధ్యతలు అప్పగించనున్నారు.

మార్గదర్శకాలకు అనుగుణంగానే..

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పాలక వర్గాల పనితీరును పరిశీలించి సహకార శాఖ రిజిస్ట్రార్‌కు నివేదికను అందించాం. అక్కడి నుంచి వచ్చిన ఆదేశాలు, సూచనల మేరకు కొన్ని సంఘాల బాధ్యతను ఉద్యోగులకే అప్పగించనున్నాం. పదవీ కాలం పొడిగింపు వర్తించే పాలకవర్గాలకు ఉత్తర్వులను జారీ చేశాం.

– శ్రీనివాస్‌రావు,
జిల్లా సహకార అధికారి

బదిలీల లొల్లి!

- ఇటీవల సొసైటీ సీఈవోలకు స్థాన చలనం కల్పించిన ప్రభుత్వం
- అప్పన్లు పెట్టుకునేందుకు అవకాశం ఇవ్వకపోవడంపై ఉద్యోగుల గుర్రు
- పోస్టింగ్ ఇచ్చిన స్థానంలో చేరేందుకు విముఖత చూపుతున్న వైనం

డొంకేశ్వర్(ఆర్మూర్): సహకార శాఖలో బదిలీల లొల్లి నడుస్తోంది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో (పీఏసీఎస్) పని చేస్తున్న సీఈవోలను ఇటీవల బదిలీ చేశారు. పలువురు అధికారులతో కూడిన జిల్లా స్థాయి కమిటీ (డీఎల్‌డీసీ) ఈ బదిలీలను చేపట్టింది. బదిలీ ప్రక్రియ పూర్తయి పది రోజులైనా కొందరు ఉద్యోగులు ఇప్పటి వరకు కొత్త పోస్టింగ్‌లో చేరలేదు. తమకు ఆప్షన్లు పెట్టుకునేందుకు అవకాశం లేకుండా బదిలీ చేశారని సీఈవోలు ఆరోపిస్తున్నారు. ఇదే కారణాన్ని చూపుతూ కోర్టుకు వెళ్లాలని ఉద్యోగులు నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. జిల్లాలో 89 సొసైటీలు ఉండగా, రెగ్యులర్ సీఈవోలుగా ఐదేళ్లు ఒకే చోట పని చేస్తున్న వారందరికీ బదిలీలు చేయాలని సహకార శాఖ గత నెలలోనే ఉత్తర్వులిచ్చింది. ఆ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో 45మంది సీఈవోలకు స్థాన చలనం కలిగింది. అయితే తమకు తెలియకుండా, ఆప్షన్లు అడగకుండా నేరుగా బదిలీ ఉత్తర్వులను మెయిల్ ద్వారా పంపడాన్ని ఉద్యోగులు తప్పుబడుతున్నారు. కొందరికి అనుకూలంగా బదిలీలు కాగా, మరికొందరికి అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులను కలిసినా పోస్టింగ్ ఇచ్చిన చోట చేరాల్సిందేనని స్పష్టం చేశారు. ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల సొసైటీ సీఈవోలు ఇదే అంశంపై కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోగా, నిజామాబాద్ జిల్లా ఉద్యోగులు కూడా కోర్టుకు వెళ్లినట్లుగా తెలిసింది.

రాష్ట్ర శాఖ నుంచి వచ్చిన గైడ్‌లైన్స్ ప్రకారమే జిల్లా స్థాయి కమిటీ పారదర్శంగా బదిలీలు చేపట్టిందని డీసీవో శ్రీనివాస్ 'సాక్షి'కి తెలిపారు. ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారమే సీఈవోలు పోస్టింగ్ తీసుకోవాలని, బదిలీలపై అభ్యంతరాలు ఉంటే ఉన్నతాధికారులకు తెలుపొచ్చని అన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- భూ భారతిపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్ష


మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్ అర్బన్: భూభారతి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. నగరంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి గురువారం ఆయన అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్లతో భూభారతిపై సమీక్ష నిర్వహించారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పురోగతిని తెలుసుకున్నారు. నిర్ణీత గడువు లోపు అన్ని దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. దరఖాస్తులు తిరస్కరణ అయితే, అందుకు గల కారణాలు స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. సాదా బైనామా, పీవోటీలకు సంబంధించిన అప్లికేషన్‌లను క్షుణ్ణంగా పరిశీలన జరపాలని, వెంటవెంటనే నోటీసులు జారీ చేస్తూ, క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని ఆదేశించారు. కాగా, హెల్త్ సబ్ సెంటర్ల భవన నిర్మాణాల కోసం అవసరమైన స్థలాలను గుర్తించాలని తహసీల్దార్లకు సూచించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లు కూలిపోయిన, పశు సంపద కోల్పోయిన బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం కింద వెంటనే పరిహారం అందేలా చూడాలన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తూ అర్హులకు వెంటనే ఆమోదం తెలపాలన్నారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద అర్హత ఉన్న వారందరూ దరఖాస్తు చేసుకునేలా చొరవ చూపాలని సూచించారు. కాగా, గ్రామ పాలన అధికారులుగా ఎంపికైన వారు నియామక పత్రాల కోసం ప్రత్యేక బస్సులలో సకాలంలో హైదరాబాద్ చేరుకునేలా చూడాలన్నారు. బోధన్, ఆర్మూర్ సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిజ్ఞాన్ మాల్వియా, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడికి కలెక్టర్ ప్రత్యేక పూజలు


వినాయకుడి వద్ద పూజలు చేస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య

నిజామాబాద్ అర్బన్: వినాయక చవితి వేడుకల్లో భాగంగా నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ప్రాంగణం(కలెక్టరేట్)లో ప్రతిష్ఠించిన వినాయకుడికి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ అన్ని శాఖల అధికారులు, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

కేరళ సంస్కృతికి ప్రతీక 'ఓనం'


సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- తిరుమల నర్సింగ్ కళాశాలలో ఘనంగా ఓనం వేడుకలు


కేరళ వాయిద్యాలు వాయిస్తున్న కళాకారులు

డిచ్‌పల్లి: కేరళ మలయాళీ ప్రజల సంస్కృతి, సాంప్రదాయానికి 'ఓనం' పండుగ ప్రతీకగా నిలుస్తుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్ శివారులోని తిరుమల నర్సింగ్ కళాశాలలో గురువారం 'ఓనం' పండుగ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించారు. కేరళ రాష్ట్ర యువతీ, యువకులు తమ సంప్రదాయ దుస్తులు ధరించి ఆకర్షణగా నిలిచారు. కేరళ వాయిద్య పరికరాలను వాయిస్తూ విద్యార్థినులు చేసిన నృత్యాలు ఆహుతుల్ని ఎంతగానో అలరించాయి. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాను ఒక డాక్టర్‌నే అని నర్సింగ్ విద్య అభ్యసిస్తున్న మీకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కరోనా సమయంలో తిరుమల మెడికల్ ఇన్‌స్టిట్యూట్స్ చైర్మన్ పరమేశ్వర్‌రెడ్డి ధైర్యంగా ముందుకు వచ్చి ప్రజలకు వైద్య సేవలందించారని ప్రశంసించారు. కరస్పాండెంట్ పద్మావతి, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రతిభ, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, నాయకులు మునిపల్లి సాయిరెడ్డి, కంచెట్టి గంగాధర్, సీహెచ్ నర్సయ్య, పొలసాని శ్రీనివాస్, అమృతాపూర్ గంగాధర్, వాసుబాబు, ధర్మాగౌడ్, రాంచందర్‌గౌడ్ పాల్గొన్నారు.

బోధనలో వారి తీరే ప్రత్యేకం..

విద్యా బోధనలో వినూత్న పద్ధతులు పాటిస్తూ ఇతర టీచర్లకు ఆదర్శంగా నిలుస్తున్నారు ఇద్దరు ఉపాధ్యాయులు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించడానికి వారు విశేషంగా కృషి చేస్తున్నారు. నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వారిపై 'సాక్షి' ప్రత్యేక కథనం...


బోధన పరికరాలతో నర్సయ్య


విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న షేక్ అబ్దుల్లా

- యూట్యూబ్ ద్వారా ఒకరు..
- బోధన పరికరాలతో మరొకరు..
- ఆదర్శంగా నిలుస్తున్న జిల్లా ఉపాధ్యాయులు

నిజామాబాద్‌అర్బన్: విద్యార్థులకు సులభంగా పాఠాలు అర్థమయ్యేలా జిల్లాలోని ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు వినూత్న పద్ధతులు పాటిస్తున్నారు. సొంత ఖర్చుతో బోధన పరికరాలు తయారు చేస్తూ, యూట్యూబ్‌లో పాఠాలను బోధించే వీడియోలు అప్‌లోడ్ చేస్తూ విభిన్నంగా విద్యా బోధన చేస్తున్నారు. విద్యార్థుల కోసం వారు చేస్తున్న కృషిని ఇతర ఉపాధ్యాయులు అభినందిస్తున్నారు.

సొంత ఖర్చుతో బోధన పరికరాలు..

మెండోరా మండలం చాకిర్యాల్ గ్రామానికి చెందిన బోయడ నర్సయ్య బాల్కొండ మండలం బస్వాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఈయన విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమయ్యేలా బోధన పరికరాలతో బోధిస్తున్నాడు. ప్రతి పాఠానికి ప్రత్యేకంగా బోధన పరికరాలను సొంత ఖర్చుతో తయారు చేస్తున్నాడు. వేసవి సెలవుల్లో కూడా డిజిటల్ బోధన చేస్తున్నారు. ఆయన తయారు చేసిన బోధన పరికరాలను ప్రదర్శిస్తూ వాట్సప్‌లో మూడు టీఎల్‌ఎంఎల్ గ్రూపులను తయారుచేసి రాష్ట్ర మంతటా ఉపాధ్యాయులు ఉపయోగించేలా చేరవేస్తున్నారు. అంతేగాక రెండేళ్ల క్రితం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన సందర్భంగా వచ్చిన పారితోషకాన్ని సైతం పాఠశాల అభివృద్ధికి ఖర్చు చేశారు. జిల్లా రిసోర్స్ పర్సన్‌గా ఉపాధ్యాయులకు అనేక అంశాలలో శిక్షణ అందిస్తున్నారు.

వీడియోలతో..

నందిపేటకు చెందిన షేక్ అబ్దుల్లా వెల్మల్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు చెప్పిన దానికంటే చూపించడం ద్వారా అర్థవంతమైన అభ్యాసనం కలిగించవచ్చని నమ్ముతారు. కరోనా కాలం నుంచి ఆయన బోధించిన అంశాలను వీడియోలు తీస్తూ, యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసి, విద్యార్థులకు చేరవేస్తున్నారు. ఈయన వీడియో పాఠాలను సుమారు 25,000 మంది ప్రయివేట్, ప్రభుత్వ టీచర్లు వీక్షిస్తూ, విద్యార్థులకు చేరవేస్తున్నారు. ఇప్పటివరకు 300 వరకు వీడియోలు రూపొందించారు. ఈమధ్య బడిబాట గురించి వెల్మల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు చేసిన వీడియో పలువురి ప్రశంసలు అందుకుంది.

తేలికగా అర్థం చేసుకుంటారు..

విద్యార్థులకు ఇబ్బంది లేకుండ బోధన చేపట్టాలని నా ఉద్దేశం. ఇందుకు అనుగుణంగా చెప్పేవాటికంటే చూడడం ద్వార విద్యార్థులు తేలికగా అర్థం చేసుకుంటారని భావించాను. దీంతో యూట్యూబ్ ద్వార పాఠాలు చెప్పడంతో నా పాఠశాలల విద్యార్థులే కాకుండ ఇతర ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాల విద్యార్థులకు కూడా ఉపయోగపడుతుండటం నాకు ఎంతో సంతోషాన్ని కలిగించింది. –షేక్ అబ్దుల్లా, ఎస్జీటీ, వెల్మల్ పాఠశాల

అందరికీ ఉపయోగపడేలా..

విద్యార్థులకు బోధన పరికరాల ద్వారా పాఠాలు బోధించడంతో సులభంగా అర్థమవుతుంది. ఇందుకోసం ప్రతి పాఠానికి బోధన పరికరాలను సొంత ఖర్చులతో స్వయంగా తయారు చేస్తాను. ఇలా అనేక పరికరాలను బోధనకు అనుగుణంగా తయారు చేశాను. దీంతో రాష్ట్రంవ్యాప్తంగా బోధన పరికరాలు అందరికీ ఉపయోగపడేలా చూస్తున్నాను.

–నర్సయ్య, ఎస్జీటీ, బస్వాపూర్ పాఠశాల

డీజేలపై నిషేధం ఎత్తివేయాలి

సుభాష్‌నగర్: గణపతి నిమజ్జనోత్సవంలో డీజేలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఆయన పోలీస్ కమిషనర్ సాయి చైతన్యకు లేఖ రాశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం అనుమతించిన పరిమిత డెసిబెల్స్‌లో డీజే వినియోగం జరగడానికి అనుమతిస్తే ఎలాంటి సమస్యలు తలెత్తవన్నారు. ఇప్పటికే పోలీస్‌శాఖ సీజ్ చేసిన డీజే వాహనాలు, సిస్టమ్స్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. ఇకపై డీజేలను సీజ్ చేయకుండా చూడాలని, నిమజ్జన సమయంలో పోలీసులు భక్తులకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం


చిన్నికృష్ణుడి పొలంలో సీపీ సాయిచైతన్య

నిజామాబాద్ రూరల్: ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం లభిస్తుందని సీపీ సాయి చైతన్య అన్నారు. మండలంలోని గూపన్‌పల్లి శివారులో సేంద్రియ పద్ధతి ద్వారా సాగు చేస్తున్న చిన్ని కృష్ణుడి వ్యవసాయ క్షేత్రాన్ని గురువారం సీపీ సందర్శించారు. అనంతరం చిన్ని కృష్ణుడితో మాట్లాడి సేంద్రియ సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. 22 వంగడాలతో ఏర్పాటు చేసిన సూచన చక్రాన్ని, 23 వంగడాలతో చిన్ని కృష్ణుడి వివరాలను ఏర్పాటు చేసిన తీరును అభినందించారు. సీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేంద్రియ పద్ధతిలో సాగుచేసిన పంటలను ఆహారంగా తీసుకోవాలని సూచించారు. యువత సైతం సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేయాలని అన్నారు. పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

మోపాల్ : గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విధులను నిర్లక్ష్యం చేయొద్దని జిల్లా పంచాయతీ అధికారి డి శ్రీనివాస్‌రావు సూచించారు. మండలంలోని కులాస్‌పూర్ గ్రామాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పల్లె ప్ర కృతివనం, నర్సరీలో నీరు నిలిచి ఉండటంతో సమస్య పరిష్కారానికి పలు సూచనలు చేశారు. వీలైనంత త్వరగా నిల్వ ఉన్న నీటిని తొలగించాలని పంచాయతీ కార్యదర్శి హనుమరాజ్‌ను ఆదేశించారు. అలాగే మురుగుకాల్వకు ఆనుకుని ఉన్న మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను మార్చాలన్నారు. వాటర్ ట్యాంకుల్లో ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేపట్టాలని అన్నారు. అనంతరం గ్రామ పంచాయతీలో రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో కిరణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

రైళ్లను పొడిగించండి



నిజామాబాద్ అర్బన్: పలు రైళ్లను నిజామాబాద్ మీదుగా పొడిగించాలని సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ జోనల్ స్థాయి సభ్యులు రావులపల్లి జగదీశ్వరరావు కోరారు. సికింద్రాబాద్‌లో గురువారం సౌత్ సెంట్రల్ రైల్వే జోనల్ స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన హాజరై సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ పలు వినతులు అందించారు. నాందేడ్ వరకు వస్తున్న వందే భారత్ రైలును నిజామాబాద్ వరకు పొడిగించాలన్నారు.తిరుపతికి వందే భారత్ సౌకర్యం కల్పించాలన్నారు. ఆర్మూర్, డిచ్‌పల్లి మధ్య ట్రాక్ లింకు కలిపించి రైల్వే బైపాస్ నివారించి భూసేకరణలో ప్లాట్ల యజమాన్లకు న్యాయం చేయాలన్నారు. తపోవన్ ఎక్స్‌ప్రెస్, పూణే, ముంబై ఎక్స్‌ప్రెస్‌లను, బెంగుళూరు, ఢిల్లీ రైళ్లను నాందేడ్ నుంచి నిజామాబాద్ వరకు పొడిగించాలన్నారు. ముంబై సికింద్రాబాద్ మధ్య మరొక రైలు నడపాలన్నారు. నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్, సీసీ కెమెరాలు స్కానింగ్ ప్రయాణికుల వసతులు తదితర వాటిని అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రయాణికుల భద్రత చర్యలు తీసుకోవాల ని కోరారు. జనరల్ మేనేజర్ వాటిని సానుకూలంగా విని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పాఠాలు అర్థమయ్యేలా బోధించాలి



బోధన్: తరగతి గదిలో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా పాఠాలను బోధించాలని డీఈవో అశోక్ ఉపాధ్యాయులకు సూచించారు. పట్టణంలోని రాకాసీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జీపీ)లో గురువారం మండల స్థాయి ఎఫ్‌ఎల్‌ఎన్(ఫండమెంట్ లిటరసీ), టీచింగ్ లెర్నింగ్ మేళా నిర్వహించారు. కార్యక్రమానికి డీఈవో ముఖ్య అతిగా విచ్చేసి, ఉపాధ్యాయులు రూపొందించిన బోధన పరికరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బోధన పరికరాల ప్రదర్శనలో ప్రతిభ చాటిన ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. ఎంఈవో నాగయ్య, కాంప్లెక్స్ స్కూల్ హెచ్‌ఎంలు సూర్యకుమార్, ఆరిఫ్ ఉద్దీన్, సీఆర్‌పీలు, ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన కళా ఉత్సవ్

నిజామాబాద్ అర్బన్: నగరంలోని జిల్లా బాలభవన్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కళా ఉత్సవ్ కార్యక్రమం గురువారం ముగిసింది. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నారు. వివిధ విభాగాలలో 11 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు డీఈవో అశోక్ తెలిపారు. అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

క్రైం కార్నర్

తండ్రి వద్దు.. పింఛన్ కావాలి

- పెన్షన్ డబ్బులను తీసుకొని తండ్రిని వదిలేసిన కూతురు
- కుమారుడికి ఫోన్ చేసి తండ్రిని తీసుకెళ్లాలని సూచించిన ఎస్సై


తుంకిపల్లి గ్రామ పంచాయతీ వద్ద పోచయ్య

నిజాంసాగర్(జుక్కల్): ఓ కూతురు తన తండ్రికి వచ్చే పింఛన్ డబ్బులు తీసుకొని, తండ్రిని వదిలేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా.. మహమ్మద్ నగర్ మండలం తుంకిపల్లి గ్రామానికి చెందిన ఎరుకల పోచయ్య, దుర్గవ్వ దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. దుర్గవ్వ, ఒక కొడుకు కొన్నేళ్ల కిందట మృతి చెందారు. మరో కొడుకు నారాయణ పెళ్లి చేసుకొని ఇల్లరికం వెళ్లాడు. అప్పటి నుంచి వృద్ధుడైన పోచయ్య నిజాంపేటలోని కూతురు నర్సవ్వ వద్ద ఉంటున్నాడు. నాల్గు రోజుల కిందట తండ్రి పింఛన్ కోసం నర్సవ్వ తన తండ్రిని తీసుకొని తుంకిపల్లి గ్రామ పంచాయతీకి వచ్చింది. సిబ్బంది డబ్బులు ఇవ్వకపోవడంతో తండ్రిని అక్కడే వదిలివేసి వెళ్లిపోయింది. దీంతో పోచయ్య గ్రామ పంచాయతీ వద్దనే ఉన్నాడు. బుధవారం జీపీ కార్యాలయం వద్ద పోస్టాఫీసు సిబ్బంది పింఛన్ పంపిణీ చేస్తుండటంతో నర్సవ్వ వచ్చి, పింఛన్ డబ్బులను తీసుకొని తండ్రిని అక్కడే వదిలేసి వెళ్లింది. పోచయ్య అనాథగా మారి రోధించడంతో విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఎస్సై శివకుమార్‌కు సమాచారం అందించారు. కూతురుకు ఎస్సై ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. కుమారుడికి ఫోన్ చేసి తండ్రిని తీసుకువెళ్లాలని చెప్పారు.

డ్రంకన్‌డ్రైవ్‌లో పలువురికి జైలు

ఖలీల్‌వాడి: నగరంలో ట్రాఫిక్ పోలీసులు ఇటీవల డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా పలువురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని గురువారం కౌన్సెలింగ్ అనంతరం పోలీసులు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. జడ్జి వారిలో 9 మందికి రూ.12వేల జరిమానా విధించగా, ఆరుగురికి 2 రోజులు, ఇద్దరికీ 3 రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బోధన్‌రూరల్: మండలంలోని నాగన్‌పల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు బోధన్‌రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి గురువారం తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్యలో ఉంటుందని ఆయన తెలిపారు. జీపీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

డీజేల సీజ్

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు డీజేలను సీజ్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు. ఆర్మూర్‌లోని రెండు వినాయక మండపాల వద్ద, ఫత్తేపూర్‌లో ఒకచోట డీజేలు ఏర్పాటు చేయగా వాటిని సీజ్ చేసి, నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.